క్లుప్తంగా

సీపీఆర్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మెడికల్ టెక్నీషియన్లు

జమ్మికుంట: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 108 ఉమ్మడి జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ ఐలావేని కుమారస్వామి, అమిరిశెట్టి బద్రీనాథ్, పైలెట్‌లు సీహెచ్.సంపత్‌రెడ్డి, బి.రమేశ్‌ల ఆధ్వర్యంలో సీపీఆర్, సీజనల్ వ్యాధులపై గురువారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. గుండెపోటుకు గురైన వ్యక్తిని ఎలా బతికించాలి, సీపీఆర్ ఎలా చేయాలో వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సురేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ



చెక్కులు అందజేస్తున్న మనోహర్

గంగాధర: పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఆర్థిక భరోసా ఇస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మనోహర్ అన్నారు. 180 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.48.63 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం మధురానగర్ ప్రజా కార్యాలయంలోపంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుబ్బాసి బుచ్చయ్య, రామిడి రాజిరెడ్డి, సత్తు కనుకయ్య, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా విద్యుత్ కనెక్షన్

జమ్మికుంట: దీపావళి పండుగ సందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేస్తున్న టపాసుల దుకాణాల నిర్వాహకులు అక్రమ విద్యుత్ కనెక్షన్లకు పాల్పడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. గతంలో సైతం విద్యుత్ కనెక్షన్‌పై ఆరోపణలు రావడంతో గొడవలు జరిగినసంఘటనలున్నాయి. నిర్వాహకులు ఇష్టారాజ్యంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడతున్నారని ఏఈ ఆనంద్‌ను వివరణ కోరగా అలాంటి చర్యలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రోడ్డుకు మరమ్మతు



పనులు పరిశీలిస్తున్న మాజీ ఎంపీపీ హరీశ్

రామడుగు: మండలంలోని మోతె వాగు లోలెవల్ వంతెన వద్ద రోడ్డుకు గురువారం మాజీ ఎంపీపీ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జవ్వాజీ హరీశ్ మరమ్మతు చేయించారు. ఇటీవల కురిసిన వర్షాలతో రోడ్డు పూర్తిగా గుంతలమయం కావడంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందిపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. సమస్యను తెలుసుకున్న హరీశ్ గుంతల్లో మట్టి పోయించారు.

వెదిరలో వైద్య శిబిరం

రామడుగు: మండలంలోని వెదిర గ్రామంలో కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ నాగరాజు 150 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి మల్లికార్జున్, కారోబార్ అశోక్‌రెడ్డి, వైద్యశాల సిబ్బంది కోట కరుణాకర్, దాసరి చంద్రశేఖర్, గూడురి మహేశ్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు



జమ్మికుంట: పట్టణంలోని న్యూమిలీనియర్ ప్లే స్కూల్‌లో గురువారం స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్కూల్ చైర్మన్ మునిపట్ల తిరుపతిరెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులు సబ్జెక్టులకు సంబంధించిన ప్రాజెక్టులు, ప్రయోగాలు, డెమోలు, ఆలోచన శక్తి, ప్రతిభ ప్రదర్శించడం వల్ల ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని పేర్కొన్నారు. ట్రస్మా మండల అధ్యక్షుడు పూల్లూరి సంపత్ రావు హాజరై విద్యార్థుల ప్రదర్శనలను తిలకించి అభినందించారు.

క్షుద్రపూజల కలకలం

జమ్మికుంట: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి గది ఎదుట క్షుద్రపూజలు చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తరగతిగది ఎదుట నల్లబొగ్గుతో ముగ్గువేసి, పసుపు కుంకుమ, నిమ్మకాయ, కోడిగుడ్డు, పచ్చిమిర్చిపెట్టి గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్రపూజలు చేశారు. బుధవారం రాత్రి వంటగది, డైనింగ్ హాల్‌లోని సీలింగ్ ఫ్యాన్ చోరీ జరిగాయని తెలిసింది.

పైసలు పడ్తలేవు..

- 'ఇందిరమ్మ' ఇళ్లకు బ్యాంకు సమస్యలు
- డబ్బుల కోసం ఎదురుచూపు



మానకొండూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో బ్యాంకు సమస్యలు ఎదురవుతున్నాయి. ఇళ్లు మంజూరు కావడంతో అధికారులు ముగ్గులు పోయడమే ఆలస్యం అన్నట్లు లబ్ధిదారులు చకచకా పనులు మొదలు పెట్టారు. మొదట్లోనే ఇళ్ల బేసిమెంట్ స్థాయిలో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆధార్‌బేస్‌డే పేమెంట్‌తో లబ్ధిదారుల ఖాతాల్లో అధికారులు డబ్బులు వేస్తున్నారు. కొందరి ఖాతాల్లో నగదు జమకాకపోవడంతో అధికారులు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. బ్యాంకు నంబర్‌తో ఆధార్ సీడింగ్, అకౌంట్‌లో డబ్బులు, ఐఎఫ్‌సీ కోడ్ వివరాలు సరిగా లేకపోవడం వంటి అనేక కారణాలతో లబ్ధిదారులు సతమతమవుతున్నారు. మానకొండూర్ మండలంలో 693 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా 584 ఇళ్లకు ముగ్గుపోసి మార్కవుట్ చేశారు. 462 గ్రౌడింగ్ కాగా 236 బేస్‌మెంట్ లెవల్, వాలింగ్ విత్ బ్రిక్స్ లెవల్‌లో 141, స్లాబ్ లైడ్ లెవల్‌లో 85 ఇళ్లు ఉన్నాయి. బేస్‌మెంట్, గోడల వరకు రూ.లక్ష చొప్పున, స్లాబ్ లైడ్ లెవల్ వరకు రూ.రెండు లక్షలు, ఫినిషింగ్ పూర్తి చేస్తే మరో రూ.లక్ష మొత్తం రూ.ఐదు లక్షలు ప్రభుత్వం చెల్లిస్తుంది. డబ్బులు చెల్లింపునకు అధికారులు బ్యాంకు ఖాతావివరాలు నమోదు చేసుకున్నారు. బ్యాంకు ఖాతా ఇన్‌ఆక్టీవ్, మినిమం బ్యాలెన్స్ లేకపోవడం, ఐఎఫ్‌సీ కోడ్ సరిగా రాయకపోవడం, అకౌంట్ నంబర్‌తప్పుగా నమోదు చేయడం వంటి సమస్యలతో బేసిమెంట్ స్థాయిలోనే లబ్ధిదారుల అకౌంట్లలో డబ్బులు పడటం లేదు. ఆధార్ బేస్‌డే పేమెంట్ సిస్టం తీసుకువచ్చిన లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమకావడంలేదని లబ్ధిదారులు వాపోతున్నారు. అవగాహన ఉన్నా వారు బ్యాంకు సమస్యల నుంచి గట్టెక్కుతున్నారు. అవగాహన లేనివారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే సంబంధిత అధికారులు సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఇళ్ల నిర్మాణంలో జాప్యం జరగొద్దు

ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

మానకొండూర్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని నిజాయితీగూడెంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను గురువారం పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణంలో జాప్యం జరగొద్దని సూచించారు. నిర్ణీత గడువులోపు ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. డబ్బుల చెల్లింపుల్లో జాప్యానికి తావు లేదని, ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందొద్దన్నారు. ఇటీవల ఇదే గ్రామానికి చెందిన సామంతుల శ్రీనివాస్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబానికి అండగా ఉంటామని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రవీంద్రాచారి, గ్రామశాఖ అధ్యక్షు డు కుంబం చిరంజీవి, మాజీ సర్పంచ్ బోళ్ల మురళి, నాయకులు రామిడి తిరుమల్‌రెడ్డి, కానిగంటి మల్లికార్జున్ రెడ్డి, గొల్లెన కొమురయ్య, బుర్ర చంద్రాకర్, కనకం కుమార్, గుజ్జ ప్రభాకర్ పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై సమీక్ష

శంకరపట్నం: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కృష్ణప్రసాద్ సమీక్షా సమావేశం నిర్వహించారు. మొదటి విడతలో మంజూరైన ఇళ్ల పురోగతి, లబ్ధిదారులకు బిల్లుల మంజూరు వంటి వాటిపై కార్యదర్శులతో సమీక్షించారు. ఇళ్లు మంజూరైనా డబ్బులు లేకుండా నిర్మాణం చేయని వారికి బ్యాంక్ రుణాలు ఇస్తే నిర్మాణం చేస్తారా వంటి వివరాలను కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులను ప్రోత్సహించి ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని సూచించారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

హుజూరాబాద్: పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి బీసీ సంఘం నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. బీసీ సిటిజన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్ మాట్లాడుతూ.. బీసీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తూనే ఉన్నాయని, ఎన్నికల సమయంలో మాత్రమే కపటప్రేమతో బీసీల ఓట్లు దండుకుంటాయన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అంశంపై రాజ్యాంగ సవరణ చేసి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఫోరం ప్రధాన కార్యదర్శి సందెల వెంకన్న, ఉప్పు శీనన్న, మార్త రవీందర్, బీసీ ఆజాద్ ఫెడరేషన్ నియోజకవర్గ అధ్యక్షుడు పంజాల తిరుపతి గౌడ్, చిట్టంపల్లి నాగరాజు, కందుకూరి భాస్కర్, జూపాక శివమణి, గోస్కుల మధుకర్, చంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.



బొమ్మనపల్లిలో షూ పంపిణీ చేస్తున్న లక్ష్మణ్‌రావు



నుస్తులాపూర్‌లో రావుల రమేశ్

దుస్తులు, షూ పంపిణీ

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి ప్రభుత్వ జెడ్పీపాఠశాలలో ఈ విద్యాసంవత్సరం చేరిన 15 మంది విద్యార్థులకు ఉచితంగా షూ పంపిణీ చేశారు. గురువారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మణ్‌రావు కూతురు అల్లుడు విద్యార్థులకు బహూకరించారు. విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో షూ అందజేశామని లక్ష్మణ్‌రావు తెలిపారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ జ్యోతి, ఉపాధ్యాయులు సీహెచ్ జ్యోత్స్న, బి. శంకర్, ఎస్. రమాదేవి, వి కవిత, వి. చంద్రశేఖర్, పి.జ్యోతితో పాటు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: మండలంలోని నుస్తులాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ రావుల రమేశ్ యూనిఫామ్స్ పంపిణీ చేశారు. పేదరికం కారణంగా విద్యార్థులు చదువుకు దూరం కావొద్దని 25 మంది విద్యార్థులకు రూ.30 వేల విలువైన డ్రెస్సులు, టై, బెల్టులు అందజేశామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని పేర్కొన్నారు. ఈసందర్భంగా పిల్లలు, టీచర్లు రావుల రమేశ్‌ను శాలువాతో సత్కరించారు. అంగన్వాడీ టీచర్లు, ఉపసర్పంచ్ బేతి శ్రీనివాస్‌రెడ్డి, నూనె సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



తిమ్మాపూర్: కరీంనగర్ కార్పొరేషన్ పరిధి 8వ డివిజన్ అల్గునూర్‌లో 22 ఏళ్ల క్రితం వెలసిన శ్రీలక్ష్మీగణపతి ఆలయం ప్రారంభోత్సవ వేడుకలకు ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. నవంబర్ 6వ తేదీ నుంచి మూడు రోజులపాటు వేడుకలు నిర్వహించనున్నామని ఆలయ కమిటీ చైర్మన్ కంది అశోక్ రెడ్డి, కమిటీ సభ్యులు, గ్రామ ప్రముఖులు గురువారం వేడుకల పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు సభ్యులు, భక్తులు కంది లక్ష్మీనారాయణరెడ్డి, సింగిరెడ్డి స్వామిరెడ్డి, కంది రాంచంద్రరెడ్డి, జాపా రవీందర్‌రెడ్డి, ఎర్రం అనంతరెడ్డి, సింగిరెడ్డి జీవన్‌రెడ్డి, కాసం సంపత్ రెడ్డి, కంది శ్యాంసుందర్‌రెడ్డి, లింగారెడ్డి, శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

అరుంధతి కల్యాణ మండపం దళిత సంఘాలకు అప్పగించాలి

తిమ్మాపూర్: మండలంలోని ఎల్ఎండీ కాలనీలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పక్కన ఉన్న అరుంధతి కల్యాణ మండపాన్ని దళిత సంఘాలకు అప్పగించాలని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో మాట్లాడారు. దళితుల కోసం మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కట్టించిన అరుంధతి కల్యాణ మండపాన్ని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంగా మార్చారని విమర్శించారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

హుజూరాబాద్: పట్టణంలో విజిలెన్స్ టాస్క్ ఫోర్స్ అధికారులు గురువారం దాడులు నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన 238.40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. వరంగల్, హన్మకొండ, తదితర ప్రాంతాలలో బియ్యం కొనుగోలు చేసి పక్క రాష్ట్రాలకు పంపుతున్నారనే సమాచారంలో దాడులు చేశామని విజిలెన్స్ టాస్క్ ఫోర్స్ సీఐ అనిల్, ఎస్ఐ వరుణ్ ప్రసాద్ తెలిపారు. ఈ దాడుల్లో హుజూరాబాద్ సివిల్ సప్లై డీటీ వసంత రావు, ఇల్లందుల వినోద్ ఉన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. యువకుడి మృతి

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని రాంపూర్ శివారులో ఇసుక ట్రాక్టర్ బోల్తాపడి రంగాపూర్ గ్రామానికి చెందిన చింటూ(22) చనిపోయాడు. చింటూ ట్రాక్టర్ డ్రైవర్. విలాసాగర్ నుంచి పెద్దపాపయ్యపల్లెకు ఇసుకను తరలించాడు. తిరిగి స్వగ్రామానికి బయల్దేరాడు. రాంపూర్ శివారులో నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారిపై ట్రాక్టర్ అతివేగంగా నడపడంతో బోల్తా పడింది. చింటూ తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే చనిపోయాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

గన్నేరువరం ఎంపీడీవోగా శ్రీనివాస్‌రెడ్డి



శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న కార్యదర్శులు, ఇతరులు

గన్నేరువరం: గన్నేరువరం మండల పరిషత్ అధికారిగా ఎ. శ్రీనివాస్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం నుంచి బదిలీపై వచ్చారు. ఎంపీవో శ్రీనివాస్ ఇప్పటివరకు ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహించారు. మండల పరిషత్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఎంపీడీవోను శాలువాతో సన్మానించారు.

చిగురుమామిడి ఎంపీడీవోగా విజయ్‌కుమార్



విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న కార్యదర్శులు

చిగురుమామిడి: చిగురుమామిడి ఎంపీడీవోగా టి.విజయ్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. జమ్మికుంట మండలం నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో బి. మధుసూదన్‌పై కలెక్టర్ సస్పెన్షన్ వేటువేశారు. ఎంపీడీవోను పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఇక్కడ ఎంపీవోగా పనిచేసిన రాజశేఖర్‌రెడ్డి హుజూరాబాద్‌కు డిప్యూటేషన్‌పై వెళ్లగా కిరణ్‌కుమార్ ఎంపీవోగా బాధ్యతలు స్వీకరించారు. కిరణ్‌కుమార్ ఇదే మండలంలో పంచాయతీ కార్యదర్శిగా ఎనిమిదేళ్లు పనిచేశారు. మండల పరిషత్ సూపరింటెండెంట్ ఖాజామొయినొద్దీన్ కొన్ని రోజులుగా సెలవులో ఉన్నారు. ఎంపీడీవో స్థానం భర్తీ కావడంతో మండల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

గట్టయ్యయాదవ్‌కు డాక్టరేట్

ఇల్లందకుంట: మండలంలోని సీతంపేట గ్రామానికి చెందిన బక్కతట్ల గట్టయ్యయాదవ్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి కామర్స్‌విభాగంలో డాక్టరేట్ పొందడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ డి.చెన్నప్ప పర్యవేక్షణలో ఈ-నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్ ఇన్ తెలంగాణ, ఏ స్టడీ ఆఫ్ సెలెక్ట్ డిస్ట్రిక్ ఇన్ తెలంగాణ స్టేట్ అనే అంశంపై గట్టయ్య చేసిన పరిశోధన గ్రంథాన్ని పరిశీలించిన ఓయూ ఎగ్జామినేషన్ అధికారులు పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేశారు. ప్రస్తుతం గట్టయ్య హనుమకొండ జిల్లా భీమారంలోని ఎస్ఆర్‌బి జూనియర్ కళాశాల డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. గురువారం సీతంపేట మాజీ ఎంపీటీసీ తెడ్ల ఓదెలు, మాజీ సర్పంచ్ మూడెత్తుల వెంకటస్వామి, ఎమ్మార్పీఎస్ నాయకులు ఇంజం వెంకటస్వామి, విద్యావంతులు ముడతనపల్లి మధుసూదన్, దాసరి కుమారస్వామి, మేకల కృష్ణ, బక్కతట్ల భిక్షపతి, మేకల గణేశ్, తెడ్ల బాబయ్య, బక్కతట్ల రవీందర్ గట్టయ్యను అభినందించారు.

సస్యరక్షణ చర్యలతోనే దిగుబడి

రామడుగు: రైతులు పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు చేపడితే ఆశించిన దిగుబడి సాధించే అవకాశం ఉందని క్రిస్టల్ కాటన్ సీడ్స్ టీబీఎం మనోహర్‌రెడ్డి అన్నారు. మండలంలోని దేశరాజ్‌పల్లి గ్రామంలో రైతు ఎల్కపల్లి అజయ్ పత్తి పొలంలో గురువారం పత్తి పంట ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. కంపెనీ ప్రతినిధులు శ్రీకాంత్, అశోక్‌రెడ్డి, రాజిరెడ్డి, ఆశిష్, సురేశ్, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి

శంకరపట్నం: గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి అన్నారు. మండలంలోని కేశవపట్నంలో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణమాసం ముగింపు సమావేశం నిర్వహించారు. ఆరోగ్యంగా ఉండేందుకు పండ్లు, పప్పు దినుసులు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీవో శ్రీలత, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో చందు, తహసీల్దార్ సురేఖ, ఎంపీడీవో కృష్ణప్రసాద్, వైద్యాధికారి శ్రావణ్‌కుమార్, సూపర్‌వైజర్లు పద్మ, అరుణ పాల్గొన్నారు.



సాక్షి స్పందన

రామడుగు: వెదిర గ్రామంలోని స్వామివివేకానంద చౌరస్తా నుంచి రామడుగు వెళ్లే రోడ్డు పక్కన గురువారం పిచ్చిమొక్కలు, ముళ్లపొదలను తొలగించే కార్యక్రమం చేపట్టారు. ఇవి దారిని రెండు నుంచిమూడు ఫీట్ల వరకు కమ్మేస్తుండటంతో వాహనదారులు ఇబ్బందిపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని, రోడ్డు పక్క నుంచి ఏం వస్తుందో, ఎలాంటి ప్రమాదం చోటు చేసుకుంటుందో తెలిక వాహనదారులు భయాందోళన చెందుతున్నారని సాక్షిలో ఈ నెల 15న ప్రచురితమైన వాట్సాప్ కథనానికి అధికారులు స్పందించారు. పిచ్చిమొక్కలు, చెట్లకొమ్మలు తొలగిస్తుండటంతో వాహనదారులు, ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వాట్సాప్ చేయండి

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

గన్నేరువరం: ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి చొక్కాల శ్రీశైలం డిమాండ్ చేశారు. గన్నేరువరంలోని కొనుగోలు కేంద్రానికి రైతులు తీసుకువచ్చిన వరి ధాన్యాన్ని గురువారం పరిశీలించారు. వరి కోతలు ప్రారంభమై కేంద్రాలకు ధాన్యం చేరుతోందని, అయినా కొనుగోళ్లు ప్రారంభకావడంలేదని, దళారులు రైతులు వద్ద తక్కువ ధరకే కొనుగోలు చేస్తూ దగా చేస్తున్నారని ఆరోపించారు. దళారుల మోసాలపై తూనికలు, కొలతల అధికారులు తనిఖీ విస్మరిస్తున్నారని, కేంద్రాల వద్ద రైతులకు నీడ, నీరు వంటి వసతులను కల్పించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు కాంతాల అంజిరెడ్డి, మండల సహాయ కార్యదర్శి కూన మల్లయ్య, గ్రామ కార్యదర్శి మల్లయ్య, సహాయ కార్యదర్శి అంజయ్యచారి, ఎండీ నయూమ్, సంపత్, విజేందర్‌రెడ్డి, పబ్బతి మల్లారెడ్డి, నర్సింహారెడ్డి, కూన నర్సయ్య, కొండల్‌రెడ్డి, తాటికొండ రాజు, పందుగ రవీందర్‌రెడ్డి, రాజిరెడ్డి, కొర్వి చంద్రయ్య పాల్గొన్నారు.

తక్కువ ధరకు విక్రయించొద్దు

చిగురుమామిడి: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయించుకోవాలని, దళారుల ప్రలోభాలకు లోనై తక్కువ ధరకు విక్రయించి నష్టపోవద్దని చిగురుమామిడి సింగిల్‌విండో చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి కోరారు. గురువారం చిగురుమామిడిలో విలేకర్లతో మాట్లాడారు. త్వరలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని, కొన్ని గ్రామాల్లో రైతులు పచ్చి ధాన్యం రైస్ మిల్లర్లకు విక్రయిస్తున్నారని, ముందుగా కోసిన ధాన్యాన్ని కేంద్రాలకు తరలించి ఆరబెడితే మద్దతు ధర లభిస్తుందన్నారు. సమావేశంలో సీఈవో నర్సయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

బంద్ విజయవంతం చేయండి



జమ్మికుంటలో మాట్లాడుతున్న నాయకులు

జమ్మికుంట: బీసీ జేఏసీ సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు 18న నిర్వహించే రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దబ్బెట రవీందర్, ప్రధాన కార్యదర్శి టంగుటూరి రాజ్‌కుమార్, మండల అధ్యక్షుడు ఏబూసి శ్రీనివాస్, ఆకుల రాజేందర్ కోరారు. గురువారం పట్టణంలోని చాణక్య డిగ్రీ కళాశాలలో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం పట్టణ అధ్యక్షుడు ముద్రగడ నవీన్‌కుమార్, కిరణ్‌కుమార్, దాసరి రామ్మూర్తి, ధర్ముల శంకర్, బలరాం, రాంబాబు, మల్లికార్జున్, ఆకుల పోచయ్య, అవుల తిరుపతి, రావుల అశోక్, నాగరాజు, కొమ్ము అశోక్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

టీజేఎస్ సంపూర్ణ మద్దతు

హుజూరాబాద్: బీసీ రిజర్వేషన్ల సాధనకు 'బంద్ ఫర్ జస్టిస్' పేరుతో 18న తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు టీజేఎస్ రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని, బంద్‌లో ప్రత్యక్షంగా పాల్గొంటామని తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముక్కెర రాజు గురువారం ప్రకటనలో తెలిపారు. బీసీ బిల్లును ఆమోదించి, రిజర్వేషన్లు అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. శాసనసభలో అన్ని పార్టీలు ఏకగ్రీవంగా ఆమోదించి ఆర్డినెన్స్ చేసి గవర్నర్‌కు పంపించినా ఆమోదించకపోవడం వల్లే రిజర్వేషన్లు ఆగిపోయాయని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల పట్ల బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే రాజ్యాంగ సవరణ ద్వారా ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు.

వెన్నెముకపై ఒత్తిడి తగ్గించండి



మాట్లాడుతున్న న్యూరో సర్జన్ రాజీవ్‌రెడ్డి

కరీంనగర్: వయస్సుతో పాటు చేసే పనిని బట్టి అధిక బరువు వల్ల నడుంనొప్పి వస్తుందని, వెన్నెముకపై ఒత్తిడి తగ్గించాలని కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి న్యూరో సర్జన్ డాక్టర్ రాజీవ్‌రెడ్డి అన్నారు. వరల్డ్ స్పైన్ డే సందర్భంగా మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం నగరంలోని కేఎస్ఆర్ పోలీసు ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో నిర్వహించిన హెల్త్ టాక్‌లో మాట్లాడారు. నడుము నొప్పి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఉద్యోగస్తులు, విద్యార్థులు రోజుకు గంటల కూర్చోవడం వల్ల నడుములో కదలికల లోపం ఏర్పడుతుందన్నారు. వెన్నెముక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే డాక్టర్ సలహా మేరకు ప్రతిరోజూ వెన్నముకకు సంబంధించిన వ్యాయామం ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. వెన్నముక సమస్యతో బాధపడే వారికి సర్జరీలు అందుబాటులో ఉన్నాయని, సాధారణ సర్జరీలు చేసినంత ఈజీగా వెన్నెముక ఆపరేషన్లు చేస్తున్నామని వెల్లడించారు. మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, మనోజ్, పోలీసు అకాడమీ నిర్వాహకులు మహిపాల్‌రెడ్డి, శిక్షణ అభ్యర్థులు పాల్గొన్నారు.